

## సంబరాల చిన్నోడు..
# శ్రీదీప్ ఆర్యన్

- హోలీ వేడుకల్లో సందడే సందడి

నగరంలో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. హనుమకొండలోని వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి స్వగృహంలో వారి మనవడు శ్రీ దీప్ ఆర్యన్ హోలీ వేడుకల్లో సందడి చేశారు. చిన్నారులతో కలిసి రంగులు చల్లుతూ హోలీ జరుపుకున్నారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ


వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 155
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
మార్చి 15, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net






# రేపు సీఎం పర్యటన



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బేగంపేటనుంచి హెలికాప్టర్ లో మధ్యాహ్నం ఒంటి గంటకు నేరుగా శివునిపల్లికి చేరుకోనున్నారు. అక్కడే ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ లను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రూ.800 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి శక్తి వంచన లేకుండా పాటుపడుతున్నారు. భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సభా వేదికను పరిశీలించిన కడియం అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యంగా హెలిప్యాడ్, సభస్థలి, వీఐపీ పార్కింగ్, సాధారణ పార్కింగ్ తదితర భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

- వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్

- మధ్యాహ్నం ఒంటి గంటకు స్టేషన్ ఘనపూర్ రాక
- రెండు గంటల పాటు శివునిపల్లిలోనే
- రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏర్పాట్లను పరిశీలించిన కడియం శ్రీహరి
- భద్రతపై సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సమీక్ష

వివరాలు2లో..



## అమ్మవారి సన్నిధిలో హీరో శ్రీకాంత్

మహా నగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని శనివారం ఉదయం ప్రముఖ తెలుగు హీరో శ్రీకాంత్ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

– వరంగల్ వాయిస్, వరంగల్














# రేపు సీఎం పర్యటన

- మధ్యాహ్నం ఒంటి గంటకు స్టేషన్ ఘనపూర్ రాక
- రెండు గంటల పాటు శివునిపల్లిలోనే
- రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏర్పాట్లను పరిశీలించిన కడియం శ్రీహరి
- భద్రతపై సీపీ సన్‌ప్రీత్‌సింగ్ సమీక్ష

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం పరిధిలోని శివునిపల్లిలో పర్యటించనున్నారు. ఆయన రాక సందర్భంగా శివునిపల్లిలోనే ప్రత్యేక హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12.25గంటలకు బేగంపేటనుంచి సీఎం బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు శివునిపల్లిలోని బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకోనున్నారు. అక్కడే ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి సభ్యులు ఏర్పాటు చేయనున్న వివిధ స్టాల్స్ లను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. 3.10గంటలకు శివునిపల్లిలోని హెలిప్యాడ్ కు చేరుకొని అక్కడినుంచి బేగంపేట వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి 2.10గంటల పాటు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని శివునిపల్లిలోనే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

### భారీ బందోబస్తు..

ముఖ్యమంత్రి రాక సందర్భంగా శివునిపల్లిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్ ఇతర పోలీస్ అధికారులు శనివారం సభా ప్రాంగణానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా హెలిప్యాడ్, సభస్థలి, వీఐపీ పార్కింగ్, సాధారణ పార్కింగ్ తదితర ఏర్పాట్లపై సీపీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు.

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తదితరులు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం చేతుల మీదుగా రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చెయనున్నారు. ఈ సందర్భంగా 50వేల మందితో భారీ కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నట్లు కడియం శ్రీహరి ప్రకటించారు. ఈ సభకు నియోజకవర్గ ప్రజలు, మహిళలు, రైతులు, యువకులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

## తిడుగు, సాగరంకు ఆర్టీసీ బస్

### ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** ఎన్నో రోజులుగా తిడుగు, సాగరం గ్రామాల ప్రజల కోరిక మేరకు ఆర్టీసీ బస్సు సర్వీస్ ను ఏర్పాటు చేసినట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్ గడ్ మండలం తిడుగు గ్రామంలో వరంగల్ బస్టాండ్ నుంచి గర్నేపల్లి, తిడుగు, సాగరం మీదుగా జఫర్ గడ్ వరకు ఏర్పాటు చేసిన నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ను ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్ తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ తిడుగు గ్రామంలో ఇప్పటికే రూ.35లక్షలతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో ఓపెన్ జిమ్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే గ్రామానికి బీటి రోడ్డు, మహిళా కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తానని హామీ



ఇచ్చారు. తిడుగు గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభకు భారీగా తరలిరండి

**- కడియం శ్రీహరి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు**



ఈ నెల 16వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి మంజూరైన రూ.800 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి అనంతరం బహిరంగ సభలో పాల్గొనేందుకు శివునిపల్లికి రానున్నారు. కావున ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, రైతులు, యువకులు, నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను జయప్రదం చేయగలరని విజ్ఞప్తి.

## 42శాతం రిజర్వేషన్లపై సీఎంకు లేఖ



**డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు (రాజకీయ), విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చింది. ఈ హామీని గత అనుభవాలు, న్యాయపరమైన సూత్రాలు, ప్రస్తుత పరిణామాలను అనుసరిస్తూ, న్యాయబద్ధంగా, పారదర్శకంగా అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ హామీని న్యాయపరంగా బలోపేతం చేయకపోతే, భవిష్యత్తులో కోర్టు కేసులు, చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు సీఎం అనుముల రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖలో హెచ్చరించారు. కుల గణన, న్యాయస్థానాల తీర్పులు, కేంద్ర ప్రభుత్వ అనుమతులు వంటి అంశాలపై పూర్తిస్థాయి స్పష్టత లేకుండా బిల్లులను ప్రవేశపెడితే, భవిష్యత్తులో వివాదాలు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఏఐ ద్వారా సులభతర విద్యా బోధన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కృత్రిమ మేధను వినియోగిస్తూ సులభతరంగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జెల్లీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) తో విద్య బోధనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్ తేజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు. అంగన్వాడి సూపర్వైజర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయినిని, కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించేది లేదు

**➲ కేతిడి దీపక్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా వరంగల్ జిల్లాలో, అభివృద్ధికి మీరు చేసినది ఏమీ లేదు. ఉద్యమాల పేరుతో ప్రజలను మోసం చేసిన మీరే ఇప్పుడు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ కేతిడి దీపక్ రెడ్డి హెచ్చరించారు. శనివారం హనుమకొండ 59వ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలను ఖండిస్తూ, "మీరు చెబుతున్నట్టు ఎమ్మెల్యే నాయినికి అనుభవం లేదని అంటున్నారు. కానీ, గత 35 సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో సేవలందిస్తున్న నాయకుడిగా ఆయన నిలిచారు" అని అన్నారు. మీ లెక్క ప్రకారం, నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించిన నిధుల నుంచి ఎంత కమిషన్ తీసుకోవాలో, కాంట్రాక్టర్లకు ఎంత ఇవ్వాలో తెలియకపోవడమే నాయిని రాజేందర్ రెడ్డి అనుభవం లేదనే అర్థమా? మీకు పోరాటాలు, ఉద్యమాలు పేరుతో రాజకీయ లబ్ధి ఎలా పొందాలో మాత్రమే తెలుసు. నిజమైన నాయకులైతే మామునూరు ఎయిర్‌పోర్ట్ ఎందుకు సాధించలేక పోయారు? కాళోజి కళాక్షేత్రం పూర్తి కాకపోవడానికి మీ పాలన కారణం కాదా? వర్షాకాలంలో వరదలతో హనుమకొండ మునిగిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమైనది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో నయీం నగర్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేసి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చారు. మీరు నిజంగా అభివృద్ధి చేయగలిగిన నేతలు అయితే, ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఓడించారు? గత పదేళ్ల పాలనలో ప్రజలను చిత్రహింసలకు గురిచేసినది ఎవరో అందరికీ తెలుసు. పదేళ్లు అధికారంలో ఉన్నా ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా ప్రజలకు అందించలేని అసమర్థులు మీరేనని బీఆర్ఎస్ నేతలను దుయ్యబట్టారు. కేవలం 16 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధిని జీర్ణించుకోలేక, బీఆర్ఎస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు పురెల్ల రవి, తెల్ల సుగుణ, తెల్ల కిశోర్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి జగదీష్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**కాంగ్రెస్ సీనియర్ నేత అంబాల రాజు**



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దళిత జాతి ముద్దుబిడ్డ తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను గురువారం జరిగిన నిండు శాసనసభ సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అగ్రవర్ణ అహంకారంతో దళితుడు అనే చులకన భావంతో కించపరచడాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, దళిత నేత అంబాల రాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అంబాల రాజు మాట్లాడుతూ మాజీ మంత్రి గుంటకట్ల జగదీశ్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గా ఎన్నికైన నుంచి దళితుడనే కారణంతో గడ్డం ప్రసాద్ కుమార్ అనేక అవమానాలకు గురవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి బడ్జెట్ పత్రాలను చించివేసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చల్లడం పాడి కౌశిక్ రెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. అలాగే, మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యుడు హరీష్ రావు గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాలలో నిండు సభలో అందరు చూస్తుండగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అగ్రవర్ణ అహంకారంతో దాడికి ప్రయత్నించారని దుయ్యబట్టారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పనిచేస్తున్న దళిత ప్రజాప్రతినిధులకు మరో మారు అవమానాలు జరిగితే చూస్తూ ఊరుకోమని, కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న దళిత సమాజం మొత్తం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# అటల్ జీ యాదిలో ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని, ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి "అటల్ జీ యాదిలో" ఆత్మీయ సమ్మేళనం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు హనుమకొండ, హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుంది. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు హాజరవుతారు. వాజపేయి సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయనతో కలిసి పనిచేసిన వారు, ఆయన ఆశయాలను కొనసాగిస్తున్న నాయకులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారు. కార్యక్రమంలో వాజపేయి వరంగల్ సందర్శన సందర్భంగా తీసిన అరుదైన ఫొటోలు, జిల్లాలోని బీజేపీ నేతలతో దిగిన చిత్రాలు, అలాగే నాటి గుర్తులను పదిలపరిచే ఇతర ఛాయాచిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేయబడుతుంది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఆరు జిల్లాల బీజేపీ అధ్యక్షులు, జిల్లా కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి కనుకుంట్ల రంజిత్ కుమార్ అటల్ బిహారీ వాజ పేయి శతజయంతి ఉత్సవాల వరంగల్ జిల్లా కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు.

# నాగారం హైస్కూల్ కు ఏకశిలా విద్యాసంస్థల చేయూత



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల పరిధిలోని నాగారం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి శనివారం స్కూల్ యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఏడో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివినట్లు గుర్తుచేసుకుంటూ, ఇప్పుడు అదే పాఠశాల విద్యార్థులకు సహాయంగా స్కూల్ యూనిఫామ్‌లు అందజేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతుగా సహాయం అందిస్తానని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.వాసంతి అభ్యర్థన మేరకు, యూనిఫామ్‌లతో పాటు దాదాపు రెండు లక్షల రూపాయల విలువైన ఫర్నిచర్ కూడా అందజేస్తానని ప్రకటించారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం గర్వకారణంగా భావిస్తున్నానని, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని, పుట్టిన గ్రామానికి, చదువుకున్న పాఠశాలకు చేయూతనివ్వడం కన్నతల్లికి సేవ చేసినట్లేనని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు విశ్వాసంతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తన చిన్ననాటి వ్యాయామ ఉపాధ్యాయుడు పి.సాంబమూర్తిని సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేయడం పట్ల ప్రధానోపాధ్యాయురాలు కె.వాసంతి, ఉపాధ్యాయ వర్గం హర్షం వ్యక్తం చేశారు.



# గణపేశ్వరాలయంలో భూపాలపల్లి సీఐ పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం గణపేశ్వరాలయం కోటగుళ్లలో శనివారం భూపాలపల్లి సీఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానించి గణపతి, నందీశ్వరుడు, శ్రీ భవాని సహిత గణపేశ్వరునికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సీఐ నరేష్ కుమార్ గౌడ్ ను ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

# బీఆర్ఎస్వీ నేతలపై కేయూ పీఎస్‌లో ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని కుక్క బొమ్మకు అతికించి ర్యాబిస్ ఇంజక్షన్ ఇస్తూ శునకానందం పొందిన ఓయూ బీఆర్ఎస్వీ నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ పిలుపు మేరకు కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం జేఏసీ బృందం కేయూ పీఎస్ లో ఎస్ఐ అనంతరి మధును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ కన్వీనర్, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మేడారపు సుధాకర్, తాళ్లపెల్లి నరేష్ లు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఓయూలోని బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు కుక్క బొమ్మకు అతికించి ర్యాబిస్ ఇంజక్షన్ ఇస్తూ, పిచ్చి కుక్క అని నినాదాలు చేస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల మనోభావాలు దెబ్బతీశారని తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని కోరారు. గౌరవ ప్రదమైన స్థానంలో ఉన్న సీఎంపై ఇలాంటి కార్యక్రమాలు చేస్తే సహించేది లేదన్నారు. ముఖ్యమంత్రిని కించపరుస్తూ మాట్లాడటంపై నిరుద్యోగ జేఏసీ నేతలు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు గుండేటి సుమన్, ముత్యాల సాయి, శ్రీనివాస్, అరుణ్ కుమార్, సాయి వికాస్, మురళి పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఏఐఎస్ బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 19న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న 2025-2026 రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి 30 శాతం నిధులు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.4000 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుండి ప్రతి బడ్జెట్‌లోనూ విద్యారంగం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలకు అనుగుణంగా విద్యారంగానికి మరింత నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని అభిప్రాయపడ్డారు. అలాగే, రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాబట్టి, ఈ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు కంటి జోడుల పంపిణీ




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** స్థానిక ఆర్బీఎస్కే బీ టీం ఆధ్వర్యంలో మైనారిటీ స్కూల్, ఎంజేబీపీటీడబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్ నర్సంపేట స్కూల్‌లో కంటి జోడుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సంపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్ దాస్ హాజరై, అవసరమైన విద్యార్థులకు కంటి జోడులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి విటమిన్–ఏ సమృద్ధిగా ఉండే క్యారెట్, పచ్చి కూరగాయలు, పాలు, గుడ్లు, చేపలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, మొలకెత్తిన గింజలు వంటి ఆహార పదార్థాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నర్సంపేట ఆర్బీఎస్కే బీ టీం ఆధ్వర్యంలో ఖానాపూర్, దుగ్గొండి, నర్సంపేట మండలాల్లో స్కూల్ పిల్లల కంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, 144 మందికి కంటి జోడులు అవసరమని గుర్తించారు. అనంతరం సీనియర్ కంటి వైద్యులు డాక్టర్ గిరిధర్ రెడ్డి, ఆఫ్థాల్మిక్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మరల రీ–స్క్రీనింగ్ నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత కంటి జోడులను తెలంగాణ మరియు కేంద్ర ప్రభుత్వాల సహాయంతో అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మంగా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ మృదుల, ఫార్మసిస్టు అన్నపూర్ణ, ఏఎన్ఎం దివ్య, టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లేట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ




**జనగామ, వరంగల్ వాయిస్:** లయన్స్ క్లబ్ డైమండ్స్ ఆధ్వర్యంలో హన్మంతాపూర్ ప్రాథమిక పాఠశాలలో 50 మంది ప్రాథమిక, అంగన్వాడీ విద్యార్థులకు పదివేల రూపాయల విలువైన భోజన ప్లేట్లు, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సహాయ కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండి సేవలు అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. క్లబ్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ నాగమల్ల సంతోష్ నాన్నగారి పుణ్యతిథి, అలాగే క్లబ్ సభ్యుడు బజ్జూరి శ్రీధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ విరాళాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. బంధుమిత్రులకు ఇచ్చే సంతోషం ఎంతైతే ఉంటుందో, పేద విద్యార్థులకు సహాయపడటం ద్వారా వచ్చే ఆనందం కూడా అంతే గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ గోడిశాల శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కందుకూరి నాగరాజు, కోశాధికారి పర్ష సిద్దయ్య, నాగమల్ల సంతోష్, బజ్జూరి శ్రీధర్, ఉపాధ్యాయులు గుర్రాల కరుణాకర్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు మమతా, సంధ్య, ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దాతలను పలువురు అభినందించారు.

# వరంగల్ అమ్మాయి – అమెరికా అబ్బాయి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశీబుగ్గకు చెందిన సీనియర్ కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్, పద్మ దంపతుల రెండో కుమార్తె సుప్రియ ఐదు సంవత్సరాల క్రితం ఫార్మసీ డిగ్రీ పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం అమెరికాలోని ఇండియానాకు వెళ్లింది. అక్కడ, అదే కాలేజీలో చదువుతున్న గ్రాండ్‌తో పరిచయం ఏర్పడి, ప్రేమలో పడింది. గ్రాండ్ తల్లిదండ్రులు నాన్సీ మయర్, జెప్ మయర్‌ను ఒప్పించి, ప్రేమజంట తమ వివాహాన్ని వరంగల్‌లో జరిపించాలని నిర్ణయించుకుంది. 2025 మార్చి 16, ఆదివారం ఉదయం 10:45 గంటలకు కీర్తి గార్డెన్స్‌లో వీరి వివాహం జరగనుంది. ఈ ప్రత్యేక సందర్భానికి గ్రాండ్ చెల్లెలు కూడా హాజరుకానున్నారు.

# త్వరలో వైద్య శాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం

- పీహెచ్ సీ, యూపీహెచ్ సీలకు కేటాయింపు
- వైద్య శాఖ మంత్రికి బత్తిని సుదర్శన్ గౌడ్ కృతజ్ఞతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డుల నిర్వహణ కోసం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ), అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్ సీ)లలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం కోసం దాదాపు 885 పోస్టులు మంజూరు చేయనున్నట్లు హెల్త్ మినిస్టర్ ప్రకటించారు. ఈ విధానం ఏప్రిల్ మొదటి వారం నుంచి అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ హెల్త్ మినిస్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై మర్రి చెన్నారెడ్డి భవన్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ లో జరిగిన వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగాం అశోక్, స్టేట్ ట్రెజరర్ యాదయ్య, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉప్పు భాస్కర్ రావు, ప్రకాష్ రావు, అవినాష్, ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను హెల్త్ మినిస్టర్ సమక్షంలో వివరించారు. గత 35 సంవత్సరాలుగా ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా అన్ని పీహెచ్ సీలలో, యూపీహెచ్సీలలో ఫార్మసిస్టులు తీవ్రమైన పనిభారం ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యను తగ్గించేందుకు ఈ–ఔషధి ప్రోగ్రామ్ కు బదులుగా ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈహెచ్ఎంఎస్) అమలు చేయాలని సూచించారు. దీని ద్వారా ప్రతి పేషెంట్ ఆరోగ్య వివరాలు, వాడుతున్న మందుల సమాచారం ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని, దేశంలో ఎక్కడైనా హాస్పిటల్ కు వెళ్లినా వారి ఆరోగ్య సమాచారం డాక్టర్స్ కు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం కోసం గత 10 సంవత్సరాలుగా మంత్రులు, అధికారులు వద్ద ప్రస్తావించినా ఫలితం రాలేదని, కనీసం ఈ ప్రభుత్వంలోనైనా ఈ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఫార్మసీ చట్టం 1948, సెక్షన్ 48 ప్రకారం అన్ని ప్రదేశాల్లో ఫార్మసిస్టు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. హెల్త్ మినిస్టర్ ఈ విషయాన్ని అర్థం చేసుకుని డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి ఈ నియామక ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఫార్మసీ ఆఫీసర్ ఫైల్ పై మినిస్టర్ సంతకం చేసి సంబంధిత శాఖకు పంపినట్లు తెలిపారు. త్వరలోనే ఫార్మసీ ఆఫీసర్ సంబంధిత జీఓ విడుదల అవుతుందని, అదనపు ఫార్మసిస్టు పోస్టుల నియామకం కూడా త్వరలోనే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ఫార్మసిస్టులకు పి.ఆర్.సి లో మంచి వేతనాలు వస్తాయని, వారి సేవలలో కనీసం మూడు ప్రమోషన్లు వచ్చేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఇతర ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న ఫార్మసిస్టులను డాక్టర్ల మాదిరిగా రెగ్యులర్ చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సుప్రీం కోర్ట్ ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని కోరారు. త్వరలో మంత్రిని స్వయంగా కలిసి ఈ అంశంపై మరింత చర్చించనున్నట్లు తెలిపారు. ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న మిగిలిన అన్ని సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరలోనే పూర్తి స్థాయిలో సమస్యల పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ తెలిపారు.

# దేవునూర్ పాఠశాలలో కృత్రిమ మేధతో బోధన



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని దేవునూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు కృత్రిమ మేధా సాంకేతికతను ఉపయోగించి పాఠాలు బోధించే కార్యక్రమాన్ని మండల విద్యాధికారి డాక్టర్ రాఘున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు, ఆంగ్లం, గణితం వంటి విషయాలలో వెనుకబడిన విద్యార్థులకు కృత్రిమ మేధా సహాయంతో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధన చేస్తారని తెలిపారు. ప్రాథమిక దశలోనే దృశ్య–శ్రవణ అనుభవాలతో విద్యార్థుల సామర్థ్యాలు పెరుగుతాయని వివరించారు. విశిష్ట అతిథి, ధర్మసాగర్ స్కూల్ కాంప్లెక్స్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ, ఈ సాంకేతికత ద్వారా వర్చువల్ రియాలిటీ విధానంలో బోధన జరగడంతో వెనుకబడిన విద్యార్థులు కూడా అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సాఫ్ట్‌వేర్ విద్యార్థుల అర్థం చేసుకున్న స్థాయిని గుర్తించి, అవసరమైన వారికి మరింత మెరుగైన బోధన అందించడంతో పాటు వారి పురోగతిని మదింపు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సునంద, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, విషయ నిపుణులు మల్లికార్జున్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# యూజీసీ నూతన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

- నూతన జాతీయ విద్యా విధానం–2020ను ప్రతిఘటిస్తాం
- ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్ యూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ ఎస్ డీ ఎల్ సీఈ జాఫర్ నిజాం సెమినార్ హాల్ లో మతోన్మాద బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన యూజీసీ నూతన నిబంధనల ముసాయిదాను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తలుగా హాజరైన పీడీఎస్ యూ జాతీయ నాయకులు పి.మహేష్, పూర్వ టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వరరావులు మాట్లాడుతూ యూనివర్సిటీలకు నిధులను సమకూర్చడానికి ఏర్పడిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) దాని పరిధిని దాటి నేడు నూతన నిబంధనల ముసాయిదాను విడుదల చేసిందని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. కళాశాలలో, యూనివర్సిటీలలో అసిస్టెంట్, ప్రొఫెసర్, వైస్ చాన్సలర్ నియామకాల్లో నిబంధనలను సడలించారని, సెర్చ్ కమిటీల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కాలరాయడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. అధ్యాపక నియామకాలకు సంబంధించిన రిజర్వేషన్స్ పై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని వీటితో ఉన్నత విద్యను అభ్యసించి వెనుకబడిన సామాజిక వర్గాల వారు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.వీటి ద్వారా దేశంలో ఉన్న యూనివర్శిటీల్లో కేంద్ర ప్రభుత్వ రాజకీయ జోక్యాన్ని పెంచి విద్యను మరింత కార్పోరేటికరించడానికి, కాషాయకరించడానికి ఇవి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. దీంతో విద్య పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలోనే రేవంత్ రెడ్డి సర్కార్ నూతన జాతీయ విద్యా విధానం 2020, యూజీసీ ముసాయిదానం వెనక్కి తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. నరేంద్ర మోడీ కార్పొరేట్ అనుకూల, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని అన్నారు. యూజీసీ నిబంధనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర విద్యార్థులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఏఐడీఎస్ఓ నాయకులు, మధుసూదన్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు నాగరాజు, పీడీఎస్ యూ పూర్వ జిల్లా అధ్యక్షులు రాచర్ల బాలరాజు, పీడీఎష్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, కోశాధికారి పవన్, సభ్యులకు గణేష్, పండు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర విద్యుత్ స్తంభాన్ని తొలగించరా..

■ కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఉర్సు చెరువు వద్ద 20 రోజులుగా పడిపోయిన కరెంట్ స్తంభాన్ని వెంటనే తొలగించాలని అధికారులను కోరినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఈ స్తంభం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో విరిగిపోయిందని, ఈ విషయాన్ని మున్సిపల్ కరెంట్ శాఖ ఏఈ, ఎలక్ట్రికల్ సబ్స్టేషన్ ఏఈలకు స్వయంగా ఫోన్ ద్వారా తెలియజేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఎప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విరిగిన స్తంభం పక్కన వందలాదిమంది వాకర్స్, గొర్రెలు, పశువులు, వ్యవసాయదారులు తరచుగా వెళ్తున్నారని, చీకట్లో కరెంట్ తీగలు తగిలే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఇంత నిర్లక్ష్యం ఎందుకు చూపుతున్నారని అధికారులను ప్రశ్నిస్తున్నానని, ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత వారిదేనని కార్పొరేటర్ రవి స్పష్టం చేశారు. వెంటనే స్పందించి, స్తంభాన్ని తొలగించేందుకు కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నేతన్నలకు హామీలు అమలు చేయాలి

◆ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** చేనేత రంగ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం ప్రవేశపెట్టనున్న రూ. 3 లక్షల కోట్లకు పైగా రాష్ట్ర బడ్జెట్‌లో, చేనేత రంగానికి ప్రత్యేకంగా రూ. 1000 కోట్లు కేటాయించాలి అని ఆయన కోరారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టల్స్, ఇతర ప్రభుత్వ సంస్థలకు అవసరమైన వస్త్రాల ఉత్పత్తి బాధ్యతను చేనేత రంగానికే ఇవ్వాలి. అలాగే, పొదుపు సంఘాల మహిళలకు రెండు చీరల చొప్పున అందించే పథకం ద్వారా చేనేత చీరల ఉత్పత్తిని ప్రోత్సహించి, వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి చేనేత కార్మికునికి నెలకు కనీసం రూ. 18,000 వేతనం అందే విధంగా చర్యలు చేపట్టాలి. నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) కింద కార్మికుల సంఖ్యను కుదించే ప్రయత్నాలను విరమించి, నిజమైన చేనేత కార్మికులందరికీ ఆ పథకం వర్తించేలా చూడాలని ఆయన సూచించారు. అదే విధంగా, నేతన్నల రుణమాఫీ ప్రకటనను వాస్తవంగా అమలు చేయాలని అన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న నేతన్నల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని, సహకార సంఘాలు, టెస్కోలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన హామీలను అమలు చేయకుంటే, చేనేత కార్మికుల ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# బీఆర్ఎస్ ధర్నా చూస్తే మొగుణ్ణి కొట్టి మొరపెట్టుకున్నట్లుంది



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో ఆదివాసీ, దళిత వర్గాల సమస్యలను పట్టించుకోకుండా, నిరుద్యోగ సమస్యలపై కూడా మొహం చాటేసిందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా. జాడి రామరాజు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ ధర్నా చేస్తే ప్రజలు ఆదరించేవారని, కానీ అసెంబ్లీలో దళితుడు స్పీకర్‌గా ఉన్న పరిస్థితిని తట్టుకోలేక బీఆర్ఎస్ నేతలు అనవసరంగా ఆందోళనలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సూర్యాపేట ఎమ్మెల్యే బీఆర్ఎస్ అధినేత సూచన మేరకు స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం, ఆపై ధర్నాకు పిలుపునివ్వడం చూస్తుంటే "మొగుణ్ణి కొట్టి మొరపెట్టుకున్నట్టే" ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నాయకులను ఇంటికి పంపినా వారి అహంకారం తగ్గలేదని, ఇప్పటికైనా ఆదివాసీ, దళిత, బహుజన వర్గాల మేధావులు, నిరుద్యోగులు గమనించి ఆలోచించాలని సూచించారు. 2018లో దళిత ఎమ్మెల్యే సంపత్ కుమార్ సభ హక్కుల ఉల్లంఘన కింద మాట్లాడాడనే కారణంతో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసిన బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. అదే సమయంలో, 2018లో దళితుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉండటాన్ని తట్టుకోలేక, కాంగ్రెస్ ఎమ్మెల్యేలని తొలగించేలా బీఆర్ఎస్ వ్యవహరించిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ రాజకీయాలకు బలయ్యే పార్టీ బీఆర్ఎస్ అని, తెలంగాణలో ఆదివాసీ, దళిత, బహుజన వర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి, తమకే నష్టాన్ని కలిగించుకుంటున్నారని అన్నారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో ఈ వర్గాలకు నిజమైన ప్రాతినిధ్యం కల్పించగల ఏకైక పార్టీ బీజేపీయే కావడంతో, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని డా. జాడి రామరాజు పిలుపునిచ్చారు.

# మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన

## జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ఉపసంహరణకు డిమాండ్



**వరంగల్ వాయిస్ మహబూబాబాద్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా పార్టీ శ్రేణులు ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును అణిచివేయడం అవివేకమన్నారు. జగదీష్ రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకపోయినా, ఆయనపై అన్యాయంగా సస్పెన్షన్ విధించారని ఆక్షేపించారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయడం అన్యాయమని, ఇది ఉద్దేశపూర్వక చర్యగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. జగదీష్ రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి ఎటువంటి అగౌరవకరమైన వ్యాఖ్యలు చేయలేదని, అయినప్పటికీ అసత్య ప్రచారంతో ఆయనను సస్పెండ్ చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, జగన్‌పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న సహా అనేక మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి నగదు అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఏప్రిల్ 6 ఆదివారం జరగబోయే పట్టాభి సీతారామచంద్ర స్వామి కళ్యాణ్ మహోత్సవ లగ్న పత్రికను వేద పండితులు గోవర్ధన దుర్వాస చార్యులు ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధనకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. అదేవిధంగా గణపురానికి చెందిన రిటైర్డ్ టీచర్ అనగాని నరహరి ఆలయ అభివృద్ధికి రూ. 5116లను ఆలయ అధ్యక్షుడికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జీవన నైపుణ్యాలపై విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పర్వతగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు అధ్యక్షతన స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల తహసీల్దార్ వెంకటస్వామి హాజరై, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, అందువల్ల అక్కడ చదివే విద్యార్థులు ఆత్మన్యూనతా భావంతో ఉండకూడదని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు మరియు జీవన నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో కీలకమని వివరించారు. పరిశీలకులుగా పాల్గొన్న రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు రమేష్, స్ఫూర్తి కార్యక్రమం ద్వారా పదిహేను ప్రధాన అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థి దశ నుంచే బాలబాలికలు జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధ్యాయులు సమర్థంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అంగన్ వాడీలో గర్భిణీలకు శ్రీమంతం



**వరంగల్ వాయిస్, గోరుకొత్తపల్లి :** గ్రామాల్లో మాత శిశు సంరక్షణను మెరుగుపరిచేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ జగ్గయ్యపేట సెక్టార్ సూపర్ వైజర్ రమాదేవి తెలిపారు. గోరుకొత్తపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ రుద్రారపు ప్రియాంక ఆధ్వర్యంలో గర్భిణీల కోసం శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రాలు పూర్వ ప్రాథమిక విద్యను అందించడంతో పాటు గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు పౌష్టికాహారం కల్పిస్తున్నట్లు వివరించారు. అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకుంటే మహిళలు, చిన్నారులు ఆరోగ్యంగా పెరుగుతారని, గ్రామంలోని ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా స్వప్న, గ్రామస్తులు రజిత, శిరీష, వర్షిత, శ్రావ్య, స్వప్న, కిశోర బాలికలు ప్రియాంక, బేబీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# 21న గౌడల దీక్షను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పేరు పెట్టాలని గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మార్చి 21న నిర్వహించనున్న ఒక రోజు దీక్షను విజయవంతం చేయాలని గౌడ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్స్ ఆవరణలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గోపా నాయకులు కన్నా పరశు రాములు గౌడ్ అధ్యక్షతన నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌ డ్, గౌడ సంక్షేమ సంఘం వంగ సదానందం గౌడ్, అంబాల ఆంజనేయులు గౌడ్, బాల్నె వెంకట మల్లయ్య గౌడ్, దూడల సిద్దయ్య గౌడ్, నామాల శ్రీనివాస్ గౌడ్, మెరుగు బాలరాజు గౌడ్, మార్క ఉపేందర్ గౌడ్, అంబాల రఘునాథ్ గౌడ్, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, బైరగోని యాదగిరి గౌడ్, బూడిద నర్సయ్య గౌడ్, గూడేటి రామచందర్ గౌడ్, తండా రమేష్ గౌడ్, అంబాల సంపత్ గౌడ్, బైరి బాలరాజు గౌడ్, బాల్నె వెంకటేష్ గౌడ్, పొడిశెట్టి వెంకన్న గౌడ్, మూల వెంకటేశ్వర్లు గౌడ్, దూడల రాజాసంపత్ గౌడ్, బైరగోని రఘు గౌడ్, గైని శ్రీనివాస్ గౌడ్, పగిడిపల్లి రాజు గౌడ్, అంబాల వెంకటేష్ గౌడ్ పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

# రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ 10వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ స్త్రీ–పురుషుల పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, మాజీ పార్లమెంటు సభ్యులు పసునూరి దయాకర్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ విజ్ఞాన్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.ఎన్. వెంకటేష్, రాష్ట్ర శాప్ కోచ్ ఇన్ సద్గురు, వరంగల్–హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బీఆర్ అంబేద్కర్, కార్యదర్శులు గోకారపు శ్యాం కుమార్, అలువాల రాజ్ కుమార్, కోశాధికారి జహూర్ సహా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కోచ్‌లు, మేనేజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరచేందుకు ఈ పోటీలు కీలకంగా నిలవనున్నాయి.

# రిపోర్టర్‌పై మందుబాబుల దాడి




**వరంగల్ వాయిస్, రేగొండ:** మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద రాంగ్ రూట్‌లో వచ్చి, స్థానిక మందుబాబులు రిపోర్టర్‌పై దాడి చేయడంతో, బాధిత రిపోర్టర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రేగొండ మండల కేంద్రంలోని కొడవటంచ ఆర్చి సమీపంలో, కొడవటంచ జాతర న్యూస్ కవరేజ్‌కి వెళ్తున్న మండల రిపోర్టర్‌పై, ఎదురుగా వచ్చిన మందుబాబులు విచక్షణరహితంగా దాడి చేశారు. దాడిలో రిపోర్టర్ కుప్పకూలగా, వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా, అక్కడ కూడా దాడికి యత్నించడం గమనార్హం. పోలీస్ స్టేషన్‌లో కూడా దాడికి ప్రయత్నించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## దాడిని ఖండిస్తున్నాం..

ఈ ఘటనను రేగొండ మండల ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. రాంగ్ రూట్‌లో వచ్చి రిపోర్టర్‌పై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ తరఫున డిమాండ్ చేశారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలి

■ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** జిల్లాలోని రైతులకు నిరంతరంగా సాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వీరబ్రహ్మాచారి తెలిపారు. శనివారం, ఆయన రెవెన్యూ ఛాంబర్‌లో వ్యవసాయ మరియు సాగునీటి పారుదల శాఖ అధికారులతో సాగునీటి సరఫరా పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి సరఫరా ప్రణాళికను కచ్చితంగా అమలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.



పలు ప్రాంతాల్లో తలెత్తుతున్న సమస్యలను త్వరితగతిన గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అలాగే, కెనాల్స్, బోర్ వెల్స్, ఇతర సాగునీటి వనరులను సమర్థంగా సంరక్షించడంతో పాటు, సాగునీరు సరఫరా కారణంగా రైతుల మధ్య ఘర్షణలు కలుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సాగునీటి సరఫరాలో ఎలాంటి అవరోధాలు లేవని, భవిష్యత్తులోనూ ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటర్ సోర్సులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఇరిగేషన్ ఎస్.ఈ. స్వర్గం నరసింహారావు, ఇరిగేషన్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి.. కలకోటి మహేందర్

ఘనంగా ఏబీఎస్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేద, దళిత, పీడిత, తాడిత, ఆదివాసీ, అణగారిన బీసీ, మహిళ వర్గాలకు ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు, సహాయాన్ని అందిస్తూ పేదల పెన్నిధిగా ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) అధ్యక్షుడు కలకోటి మహేందర్ నిలిచిపోయారని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకుడు తెలంగాణ కొమురయ్యలు కొనియాడారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్ ఏరియాలో సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలకోటి మహేందర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాదాసి సురేష్, తెలంగాణ కొమురయ్యలు మాట్లాడుతూ అసైన్డ్ రైతులకు పూర్తి హక్కుల కోసం ఏబీఎస్ ను ఏర్పాటు చేసి కలకోటి మహేందర్ పోరాడారని ఆయన పోరాటంతో ప్రభుత్వాలు దిగి వచ్చి అసైన్ రైతులకు పూర్తి హక్కులు ఇస్తామని ప్రకటించాయని గుర్తు చేశారు. కలకోటి మహేందర్ మాట్లాడుతూ తన బొందిలో ప్రాణం ఉన్నంత వరకు, తన గొంతులో ఊపిరి ఉన్నంత వరకు పేదల కోసం పోరాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు మంద నవీన్, వేల్పుగొండ నర్సింగరావు, డీబీఎఫ్ జిల్లా నాయకులు మోరే ఐలయ్య, మాట్ల మురళి, గొడిశాల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# 18న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

కేయూ లైబ్రరీ వద్ద వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూజీసీ కొత్త ముసాయిదాను వ్యతిరేకిస్తూ, పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మార్చి 18న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న "యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు"ను విజయవంతం చేయాలని పీడీఎస్ యూ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి.కావ్య పిలుపునిచ్చారు. శనివారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ ముందు రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.బాలకృష్ణ, వి. కావ్య మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూజీసీ నూతన సంస్కరణలు దేశంలోని విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉన్నాయనీ, అవి వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. కేయూ ఉపాధ్యక్షులు పి. అనూష, గణేష్, సహాయ కార్యదర్శులు యాదగిరి, సాధన, నాయకులు సౌమ్య, శ్రీజ, చారి, నాగరాజు, పెరియార్ పాల్గొన్నారు.

# అక్రమ సభ్యత్వాలపై చర్యలు తీసుకోవాలి

■ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా మత్స్యశాఖ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ ను శనివారం కలిసి ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ, "ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ కాట్రపల్లి (M–333)51 మంది సభ్యులతో 1997లో స్థాపించబడింది. మేమంతా ఊర చెరువు చేపలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. అయితే, తాజాగా ప్రచురించిన ఓటర్ జాబితాలో క్రమసంఖ్య 1 నుండి 27 వరకు గల సభ్యులు కాట్రపల్లి గ్రామపంచాయతీకి చెందిన వారు కాగా, 28 నుండి 57 వరకు ఉన్నవారు భవాని గడ్డ తండా గ్రామపంచాయతీ శివ శంకర్ నగర్ ప్రాంతానికి చెందిన వారు." అయితే, బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంఘ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు ఎదురుబోయిన సూరయ్య తండ్రి చంద్రయ్య, 5-12-2019 ఎన్నికల అనంతరం సంఘ సంబంధిత పత్రాలను ఇవ్వకుండా దాచిపెట్టారు. అంతేగాక, ఎదురుబోయిన సురేష్, పోలు వెంకన్న, కుక్కల చెన్నమల్లు సహా నలుగురు వ్యక్తులు మా సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి, అప్పట్లోని జిల్లా మత్స్యశాఖ అధికారి సహకారంతో భవాని గడ్డ తండా శివశంకర్ నగర్‌కు చెందిన 30 మందికి అక్రమంగా సభ్యత్వం కల్పించారు. ప్రచురించబడిన ఓటర్ జాబితాలో 28 నుండి 57 వరకు ఉన్న సభ్యులకు మా సంఘంతో ఎటువంటి సంబంధం లేదు. ఫోర్జరీ చేసిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవాలని, 2021లో పనిచేసిన జిల్లా మత్స్యశాఖ అధికారిని విచారించి నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఉద్యోగం నుండి తొలగించాలని, అలాగే అక్రమ సభ్యత్వాలను రద్దు చేసి, సరికొత్త ఓటర్ జాబితా తయారు చేసి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు గడ్డం ఉప్పలయ్య, కుల పెద్ద ఎదురుబోయిన యకయ్య, సంఘ డైరెక్టర్ చెలుకలపల్లి మల్లేశ్, సభ్యులు దబ్బేటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆ ఒక్కటీ అడుగొద్దు..

## మలయాళ ముద్దుగుమ్మకు ఓ వింత ప్రశ్న

చెత్త ప్రశ్నలు ఎందుకని సమాధానమిచ్చిన మాళవిక

ప్రస్తుతం తెలుగు, తమిళ్ భాషల్లో క్రేజీ హీరోయిన్‌గా వెలుగొందుతోంది మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్. తంగలాన్ సినిమాతో ఈ ముద్దుగుమ్మ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఆ మధ్యన ఓ హిందీ సినిమాలోనూ తళుక్కుమందీ అందాల తార. ఇక ప్రస్తుతం ప్రభాస్ ది రాజాసాబ్ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోందీ మలయాళ ముద్దుగుమ్మ. సినిమాల సంగతి పక్కన పెడితే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది మాళవిక. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ విషయాలను అందులో షేర్ చేసుకుంటుంది. అలాగే ఎప్పటి కప్పుడు తన గ్లామరస్ అండ్ ఫ్యాషనబుల్ ఫోటోలు, వీడియోలను తన ఫాలోవర్లతో పంచుకుంటుంది. ఇక తీరిక దొరికినప్పుడల్లా నెటిజన్లతో ముచ్చటిస్తుంటుందీ అందాల తార. వారు అడిగే ప్రశ్నలకు ఎంతో ఓపికగా సమాధానాలిస్తుంటుంది. అలా తాజాగా కూడా తన ఫాలోవర్లతో ముచ్చటించింది మాళవిక. ట్విట్టర్ వేదికగా అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు ఇచ్చింది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి ఎవరికీ తెలియని విషయాలను పంచుకుంది. అయితే ఇదే సమయంలో ఒక నెటిజన్ దీనిని అడ్వాంటేజ్ గా తీసుకున్నాడు. ఓ నెటిజన్ మాళవికాను డైరెక్ట్‌గా మీరు వర్జినా అని ప్రశ్నించాడు. దీనికి స్పందించిన మాళవిక.. 'ఈ రకమైన చెత్త ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారు. ఇలాంటివి అడగడం మానేయండి' అని గట్టిగా ఇచ్చిపడేసింది. దీంతో సదరు నెటిజన్ తన ప్రశ్నను డిలీట్ చేశాడు. ఇక మాళవిక ట్వీట్ మాత్రం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ప్రస్తుతం మాళవిక పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ తో కలిసి 'ది రాజా సాబ్'సినిమాలో నటిస్తోంది. మారుతి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో నిధి అగర్వాల మరో హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే వరలక్ష్మి శరత్ కుమార్, సంజయ్ దత్, అనుపమ్ ఖేర్, రిద్ధి కుమార్, మురళీ శర్మ, జరీనా వాహబ్, వెన్నెల కిశోర్, బ్రహ్మానందం, యోగిబాబు, వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ది రాజా సాబ్ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అప్పుడు నేను తప్పు చేశాను..

సురేఖావాణి కూతురు సుప్రీత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి మంచి క్రేజ్ ఉంది. తన వీడియోలు, ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది. అంతే కాదు ఈ మధ్య గ్లామర్ షోతో అభిమానులను కవ్విస్తుంది. హీరోయిన్స్ ను మించి తన అందాలతో మతిపోగొడుతోంది. త్వరలోనే ఈ చిన్నది హీరోయిన్ గా సినిమా చేస్తుంది. మొనీమధ్యే అమర్ దీప్ హీరోగా ఓ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే మొదలైంది. త్వరలోనే ఈ సినిమా నుంచి అప్డేట్స్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే తాజాగా సుప్రీత ఓ ఆసక్తికర వీడియోను షేర్ చేసింది. ఇక ఇప్పుడు ఎక్కడ చూసిన బెట్టింగ్ యాప్స్ పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్స్ బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బెట్టింగ్ యాప్స నుప్రమోట్ చెయ్యొద్దు అంటూ అవేర్నెస్ చేస్తున్నారు కొందరు. అలానే సుప్రీత కూడా బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేయకండి అంటూ ఓ వీడియో చేసింది. సోషల్ మీడియా ఇన్ఫ్లులెన్సర్స్ తెలిసో తెలియకో బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారు. నేను కూడా గతంలో చేశాను ఇప్పుడు మానేశాను అని తెలిపింది. ఎవ్వరూ బెట్టింగ్ యాప్స్ ను నమ్మకండి. ఈజీ మనీకి అలవాటుపడకండి. బెట్టింగ్ యాప్స్ ను డిలీట్ చేయండి అంటూ వీడియో చేసింది. అలాగే ఆమె తల్లి సురేఖ వాణి కూడా ఓ వీడియో చేశారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 100 పర్సంట్ స్ట్రైక్‌రేట్ ..

నాని ఏపీ 2024 ఎలక్షన్స్ తర్వాత హండ్రెడ్ పర్సంట్ స్ట్రైక్ రేట్ అనే పదం బాగా వినిపించింది. పవన్ కళ్యాణ్ పార్టీ పోటీ చేసిన 21 స్థానాలలో గెలుపొందడంతో ఈ పదం ఎక్కువగా వినిపించింది. నిజంగా ఇది ఒక అద్భుతం. అయితే ఇలాంటి స్ట్రైక్ రేట్ దర్శకుల విషయానికి వస్తే రాజమౌళి, అనీల్ రావిపూడి సాధించారు. ఇక నిర్మాతగా హీరో నాని ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం. హీరోగా మంచి ఇమేజ్ ఉన్న నాని వాల్ పోస్టర్ బ్యానర్ స్థాపించి నాని నిర్మాతగా మారాడు. తన అభిరుచికి తగిన కథల్ని ఎంచుకొని కొత్త టాలెంట్‌ని ప్రోత్సహిస్తున్నారు. 'అ' లాంటి కథని తెరపైకి తీసుకొచ్చి తనలో ఎంత దమ్ముందో నిరూపించాడు. ప్రశాంత్ వర్మ అనే దర్శకుడిని అ సినిమాతో పరిచయం చేసి ఇండస్ట్రీకి ఓ మంచి దర్శకుడిని కూడా అందించాడు. ఇక నాని నిర్మాణంలో వచ్చిన హిట్ 1, హిట్ 2 సినిమాలు కమర్షియల్ గా మంచి విజయాల్ని అందించాయి. శైలేష్ కొలను అనే దర్శకుడు ఈ సినిమాలతో తనలోని సత్తా చూపించాడు. ఇక త్వరలో హిట్ 3 చేయబోతున్నాడు. దానికి ముందు కోర్ట్ అనే సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చాడు నాని .పరిమిత వనరులతో తీసిన ఈ సినిమా ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తుంది. సినిమాపై ఎంత నమ్మకం ఉంటే రెండు రోజుల ముందే నాని ప్రీమియర్స్ వేస్తాడు. కోర్ట్ నచ్చకపోతే హిట్ 3 కూడా చూడకండి అని ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు నాని. ఎంత ధైర్యం ఉంటే ఇలాంటి స్టేట్‌మెంట్ ఇస్తారు. అయితే కోర్టు హిట్ అయింది కాబట్టి సరిపోయింది కాని లేదంటే నానిని సోషల్ మీడియాలో గట్టిగా ట్రోల్ చేసేవారు. ఆ ప్రభావం 'హిట్ 3' పై కూడా ఉండేది. ఏది ఏమైన వరుసగా నాలుగు విజయాలతో నిర్మాతగా 100 స్ట్రయిక్ రేట్ సాధించాడు నాని. ఈ సినిమాలన్నీ ఒక ఎత్తు. రాబోతున్న హిట్ 3 మరో ఎత్తు అని చెప్పాలి. ఇక చిరంజీవి శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న సినిమాకు కూడా నాని సమర్పకుడు కాగా,ఈ సినిమాతో మరో హిట్ నాని తన ఖాతాలో వేసుకుంటాడని అంటున్నారు.

# చిరంజీవికి మరో అరుదైన గౌరవం



మెగాస్టార్ చిరంజీవికి మరో అరుదైన గౌరవం దక్కింది. యూకే ప్రభుత్వం ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. నాలుగు దశాబ్దాలకుపైగా సినీ రంగానికి ఆయన చేస్తున్న విశేష సేవలకుగాను జీవిత సాఫల్య పురస్కారం అవార్డు అందించనున్నట్లు తెలిపింది. మార్చి 19న ఈ అరుదైన గౌరవాన్ని యూకే పార్లమెంటులో చిరంజీవి అందుకోనున్నారు.

# రాయలసీమ నేపథ్యంలో..



కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్ కోసం ఎదురుచూస్తున్నారు యువ హీరో అక్కినేని అఖిల్. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్‌కాకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. ప్రస్తుతం అఖిల్ స్వీయ నిర్మాణ సంస్థ అన్న పూర్ణ స్టూడియోస్‌లో ఓ చిత్రాన్ని చేస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకుడు. ఇటీవలే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. నేటి నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్లు తెలిసింది. రాయలసీమ నేపథ్యంలో పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. అధికభాగం చిత్తూరు జిల్లాలో షూటింగ్ చేస్తారట. శ్రీలీలను కథానాయికగా తీసుకునే అవకాశముందని తెలిసింది. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్‌ను పెట్టబోతున్నారని వార్తలొస్తున్నాయి. దసరా బరిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ
- హనుమకొండలో రెండు జిల్లాల కార్యవర్గ సమావేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కోసం పోరాడుతామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఉద్ఘాటించారు. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో హనుమకొండ, వరంగల్ జిల్లాల టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ల విషయంలో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని అన్నారు. డెస్క్ జర్నలిస్టులతో సహా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందే విధంగా టీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని అన్నారు. నేడు అక్రిడిటేషన్ లు అంగట్ లో సరుకుగా మారాయని, గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారముగా అక్రిడిటేషన్ నిబంధనలు పెట్టి చిన్న పత్రికలను ఏబీసీడీలుగా వర్గీకరించారని, బాషా ప్రాతిపదిక నిబంధనతో ఉర్దూ పత్రికలకు అన్యాయం చేస్తే కోర్టుకు వెళ్లి ఆ నిబంధనలను తొలగించామని అన్నారు. అలాగే జర్నలిస్టులకు ఆరోగ్య పథకం కావాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే పోరాడుతున్నదని, ఇటీవలే ఆర్థిక శాఖ, ఆరోగ్య శాఖ మంత్రులను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా జేహెచ్ఎస్ ప్రారంభించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ మాట్లాడుతూ జిల్లాల్లో నిర్మాణ పరంగా టీయూడబ్ల్యూజేను పటిష్ఠం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ లు అర్హులైన వారందరికీ అందేలా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు, సీనియర్ నాయకులు దాసరి క్రిష్ణా రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎం.రాంచందర్, హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు తోట సుధాకర్, మట్టా దుర్గా ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పి.వేణు మాధవ్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.రజనీకాంత్, గుంటి విద్యాసాగర్, రెండు జిల్లాల ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.





# కాలం చెల్లిన మందుల సరఫరా

- గుర్తించిన బంధువులు
- వైద్య సిబ్బంది దురుసు సమాధానం
- తప్పులు సహజమంటూ దాటవేత

**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో వైద్య సిబ్బంది మందుల సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పసి పిల్లలకు వ్యాక్సిన్ అందజేసిన క్రమంలో జ్వరం వస్తే ఇవ్వాల్సిన మందును (సిరప్) ఎక్స్ పైర్ అయినది ఇవ్వడంతో బందువులు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు మెడిసిన్ కాలం చెల్లిందని గుర్తించి వెంటనే సిబ్బందికి తెలియజేయగా, వారు దురుసుగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. పసిపిల్లలకు నిర్లక్ష్యంతో కాలం చెల్లిన మందులు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే తప్పులు సహజమంటూ, రూల్స్ మాకు తెలుసు అంటూ, ఆన్ లైన్ లో ఎంటర్ చేయాలంటూ దాటవేత సమాధానాలు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనీ బాధితులు కోరారు. ప్రజలకు ముఖ్యంగా చిన్న పిల్లలకు వైద్యం అందించడంలో కీలకపాత్ర వహించే వైద్య సిబ్బంది పనితీరు పట్ల ఉన్నతాధికారులు జాగరూకతతో వ్యవహరించాలంటున్నారు. ప్రజలకు మేలు జరిగేలా చూడాలని వేడుకుంటున్నారు.

# వ్యాపారి ఆత్మహత్యాయత్నం

- వరంగల్ చౌరస్తాలో ఘటన
- ఇద్దరికి తీవ్ర గాయాలు




**వరంగల్ వాయిస్, క్రైం :** బ్యాంక్ అధికారుల వేదింపులు తట్టుకోలేక తమ దుకాణం ఎదుటే శనివారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన వరంగల్ చౌరస్తాలో చోటుచేసుకుంది. జేపీఎన్ రోడ్ లోని చిలుకూరి బ్రదర్స్ క్లాత్ స్టోర్స్ యజమానులు ఆనంద్, హేమ్ కుమార్ రెండు సంవత్సరాల క్రితం ఖాజీపేటలోని యూనియన్ బ్యాంకు శాఖలో భూమిని తాకట్టుపెట్టి రూ.1.20కోట్ల రుణం తీసుకున్నారు. లోన్ తీసుకున్న నాటి నుంచి తిరిగి చెల్లింపులు చేయకపోవడంతో యూనియన్ బ్యాంక్ అధికారులు ఆనంద్, హేమ్ కుమార్ కు సంబంధించిన ప్రాపర్టీని వెలం నిర్వహించారు. ఈ వేలంలో బిల్డర్ సంపత్ కుమార్ స్థలాన్ని దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో స్థలాన్ని వేలం పాటలో దక్కించుకున్న సంపత్ కుమార్ నేడు సైట్ వద్దకు రాగానే ఆనంద్, తేజస్విని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం వారిని ఆసుపత్రికి తరలించారు. బ్యాంక్ అధికారుల వేదింపుల వల్లే తమ కుటుంబం ఇబ్బందులకు గురైందని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విలేఖరి ముసుగులో అఘాయిత్యం సిగ్గుచేటు

- కామాంధుడిని కఠినంగా శిక్షించాలి
- ఎమ్మార్పీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సదానందం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో సాక్షి దినపత్రిక విలేఖరిగా పనిచేస్తున్న ఆకుల అశోక్ ఓ వితంతుపై అఘాయిత్యం చేసిన సంఘటన తనను బాధించిందని ఎమ్మార్పీఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సదానందం తెలిపారు. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళకు ఓదార్పునియ్యవలసిన విలేకరి తన వృత్తి ధర్మాన్ని మరిచి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కామంతో కళ్ళు మూసుకున్న ఇలాంటి దుర్మార్గుడిని కఠినంగా శిక్షించి బాధిత మహిళలకు న్యాయం చేయాలన్నారు. అయితే ఈ విషయంలో కొందరు అధికార పార్టీ నాయకులు దోషిని రక్షించేందుకు కుతంత్రాలు పన్నుతున్నట్లు ఆరోపించారు. పోలీసుల అదుపులో ఉన్న అశోక్ కు సపోర్ట్ చేసే నీతి తక్కువ నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అవసరమైతే అన్యాయానికి అండగా నిలుస్తున్న వారి ఇంటి ఎదుట ఆందోళన చేపడతామన్నారు.

# కొమ్మాలలో బాహాబాహి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తోపులాట
- లాఠీ చార్జి చేసిన పోలీసులు





**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొమ్మాల జాతర కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల బాహాబాహికి వేదికైంది. శనివారం రెండు పార్టీలకు చెందిన నేతలు, నాయకులు తమ ఆదిపత్యాన్ని కొనసాగించేందుకు ఏర్పాటు చేసిన ప్రభ బండ్లు సమస్యకు కారణంగా మారాయి. ఎవరికి వారు తమ ప్రభ బండ్లతో వేలాదిగా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షన ప్రారంభమైంది. చిలికి చిలికి గాలివానగా మారడంతో ఒకరిపై ఒకరు దాడికి దిగారు. దీంతో ఆలయ ప్రాంగణం రణరంగంగా మారింది. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇరు వర్గాలను శాంతింప జేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒక సమయంలో బీఆర్ఎస్ నాయకులు బారికేడ్లను తొలగించి ప్రభ బండ్లతో ముందుకు వచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు తమ లాఠీలకు పనులు చెప్పారు. దొరికిన వారిని దొరికినట్లు చితక బాదారు. దీంతో బతుకు జీవుడా అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు కాలికి పని చెప్పారు. ఒక సమయంలో పోలీసులు కాల్పులు జరిపారంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం సాగింది. అయితే గిర్ని బావి వద్ద కాల్పులు జరగలేదంటూ వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ప్రకటించారు. కొమ్మాల జాతర సందర్భంగా గిర్నిబావి ప్రాంతంలో ప్రభ బండ్లు వరుస క్రమంలో తరలి వెళ్లే క్రమంలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించడంతో పాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆదేశాలను పాటించకుండా తొసుకుంటూ ముందుకు రావడంతో తోపులాట మాత్రమే జరిగిందన్నారు. అంతేకాని ఈ సంఘటన లో ఎలాంటి పోలీస్ కాల్పులు జరగలేదన్నారు. కొన్ని ప్రచార మధ్యామాల్లో ఈ సంఘటనలో కాల్పులు జరిగినట్లుగా ప్రజలను ఆందోళన కలిగించే రీతిలో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరైనా ప్రజలను ఆందోళన కలిగించే రీతిలో వార్తలు సామాజిక మధ్యమాల్లో పోస్టులు పెట్టినా, వార్తలు రాసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com